

## ఘనంగా బీర్సా ముండా వర్ధంతి

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని సోమిని గ్రామంలో సోమవారం భారత స్వతంత్ర సమరయోధులు బీర్సా ముండా 125 వర్ధంతిని ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు బిర్సా ముండా అన్నారు. 22 ఏళ్ల వయసులోనే బ్రిటీషర్లపై యుద్ధం ప్రకటించి తద్వారా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయాడన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటితరం యువత కృషి చేయాలని, హక్కుల సాధన కోసం ఉద్యమించి బీర్సా ముండా వారసులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

## 14న జాతీయ మెగాలోక్ అదాలత్




**ఉద్యమ కెరటం, తాండూర్:** ఈ నెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నచిన్న కేసులకు కోర్టుల వెంబడి తిరుగుతూ తమ విలువైన సమయాన్ని డబ్బులు వృథా చేసుకోకూడదని, ఒకరినొకరు అర్థం చేసుకొని కక్షిదారులందరూ ఈ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం తాండూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బోయవాడ, ఎస్సీ కాలనీలలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం కాంగ్రెస్ మండల నాయకులు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ మహేందర్ రావు, కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ జడ్పీటీసీ సాలిగామ బానయ్య, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, యూత్ కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షులు పట్టెం విష్ణు కల్యాణ్, డాక్టర్ పెద్దబోయిన శంకర్, రహెమత్ ఖాన్, డాక్టర్‌కుమ్మరి సత్యనారాయణ, సింగరావు శ్రీధర్, పీ మల్లేష్, కోరల శంకర్, ఎస్ రఘు, మీర్ మోసిన్ అలీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సదస్సులు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో సోమవారం భూభారతి అవగాహన సదస్సును నిర్వహించినట్లు తహసీల్దార్‌రామ్మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిస్సింగ్ సర్వే నంబర్లు ఇతర సమస్యలు ఉన్నవారు లిఖితపూర్వక దరఖాస్తులను సమర్పించాలని అన్నారు. తమ పరిధిలో ఉన్న కొన్ని అంశాలను విచారణ జరిపి సత్వర పరిష్కారం మార్గం చూపెడతామని అన్నారు. పట్టా సందర్భంలో తప్పులు జరిగినా సరిదిద్దే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం బెల్లంపల్లిబస్తీ 4వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తను ఎలా వేరు చేయాలో మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌కమిషనర్ శ్రీనివాస రావు, ఎన్విరాన్ మెంట్ ఇంజినీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, సీఓ కిషోర్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు సుజాత, మహిళలు పాల్గొన్నారు.

# కేసుల నమోదు సక్రమంగా జరగాలి

### బాధితుల సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### ఎస్పీ అఖిల్ మహాజన్



**ఉద్యమ కెరటం ఆదిలాబాద్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి సత్వరమే తగు కార్యాచరణను అవలంబించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎస్పీ అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 40 మంది ఫిర్యాదుదారులు సమస్యలను ఎస్పీకి నేరుగా నివేదించారు. సమస్యలను విన్న ఎస్పీ వెంటనే ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్న జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై నేరుగా ఎస్పీకి సమాచారం అందించాలంటే 8712659973 నెంబర్ కి వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. నిర్భయంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ప్రజలు పూర్తిగా సమస్యలపై ఆశ్రయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగమాధికారిని జైస్వాల్ కవిత, వామన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంపై 12 నుండి స్పెషల్ డ్రైవ్

### అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** బాల కౌమార కార్మికుల రక్షణ పునరావాసంపై జిల్లా మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ విభాగం, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మికులు వ్యతిరేక దినోత్సవం ఈ నెల 12 వ తేదీ నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక కార్యకమాలు నిర్వహించుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 12న జరుపుకుంటారని, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఈ దినోత్సవాన్ని బాల కార్మికుల సమస్యపై అవగాహన కల్పిస్తూ, దాని నిర్మూలనకు కృషి చేయడానికి ప్రారంభించిందన్నారు. ఈ దినోత్సవం బాల కార్మికులను నిర్మూలించడానికి, పిల్లలను దోపిడీ నుండి రక్షించడానికి సమిష్టి చర్య యొక్క ఆవశ్యకతను నొక్కిచెప్పడానికి బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవంలక్ష్యాలు, బాల కార్మికుల సమస్యపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేయడం, పిల్లలను దోపిడీ నుండి రక్షించడం, బాలల హక్కులను కాపాడటం జిల్లాలో బాల కార్మికులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. బాల కార్మికుల సమస్యపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా, సమాజంలో మార్పు తీసుకురావడానికి సహాయపడుతుందని అన్నారు. బాలల హక్కులను కాపాడటానికి వారి భవిష్యత్తును నిర్మించడానికి అవసరమై న చర్యలు తీసుకోవడానికి ఈ వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి మిల్కా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూముల జోలికి వస్తే ఊరుకోం

- ఆలయ భూమి పట్టాను దేవుడి పేరిట మార్చండి
- శ్రీ రామ్ మందిర్ ఆలయ కమిటీ డిమాండ్



**ఉద్యమ కెరటం ఆదిలాబాద్ (గుడిహత్నూర్):** ఆలయ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం ఉమ్రి (బీ) శ్రీరామ్ మందిర్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. ఉమ్రి(బీ) శివారులో 5 ఎకరాలు, రెండ్ల బోరి రెవెన్యూ శివారులో5 ఎకరాల ఆలయ భూమిని మహరాష్ట్రలోని ఉమ్రాజ్ కు చెందిన ఏక్‌నాథ్ అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేసి, ఆలయ కమిటీ పేరిట మార్చాలని సోమవారం గుడిహత్నూర్ తహసీల్దార్ కార్యలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉమ్రి(బీ) గ్రామానికి చెందిన దివంగత పంద్రం గంగారాం మాస్టర్ 1964లో 5 ఎకరాలు, రెండ్ల బోరి శివారులో 5 ఎకరాలను దుబ్బక గంగాధనం ఆలయానికి అప్పటి పూజారిగా నాందేవ్ మహరాజ్ సమక్షంలో విరాళంగా ఇచ్చారన్నారు. అయితే, నాందేవ్ మహరాజ్ కొడుకు ఏక్ నాథ్ మహరాజ్ ఆ భూములను తన పేరున పట్టా చేసుకున్నాడని వివరించారు. నాందేవ్ మహరాజ్ 1985లో మరణించగా, ఆయన కొడుకు ఏక్ నాథ్ మహరాజ్ 1999లో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను శాంతాపూర్‌గ్రామస్తులే నిర్వహించారన్నారు. ఏక్ నాథ్ మహరాజ్ మృతి తర్వాత ఆయనకు వారసులు లేనందున ఆ 10 ఎకరాల భూమి శ్రీరామ్ మందిర్ లో అర్క సంభు మహరాజ్ పూజారిగా ఉండటంతో ధరణి పోర్టల్ వచ్చేవరకు అర్క సంభు మహరాజ్ కబ్జాలో ఉండేదన్నారు. కానీ, ధరణి వచ్చిన తర్వత మహరాష్ట్రలోని ఉమ్రాజ్ కు చెందిన ఏక్ నాథ్ మహరాజ్ గుడిహత్నూర్ మండలంలోని తన బంధువుల ద్వారా శ్రీరామ్ మందిర్ పూర్వపరాల తెలుసుకొని, అక్కడ ఉన్న అడవీ ప్రాంతంలోని టేకు చెట్ల మీద కన్నేసి, తాను వారసుడు కాకున్న తప్పుడు డ్యాకుమెంట్లు సృష్టించి తన పేరు మీద పట్టా చేసుకున్నాడన్నారు. తక్షణమే రెవెన్యు అధికారులు విచారణ జరిపి, ఆలయ భూమిని ఆలయ కమిటీ పేరు మీద చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ఉమ్రి(బీ) మాజీ సర్పంచ్ అర్క మహదు, ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా ఆధ్యక్షుడు రాయిసిడం జంగుపటేల్, రాయిసెంటర్‌మాజీ సార్మేడి పేందోర్ మారుతిరావు, మాజీ సర్పంచ్ సోయం బొజ్జు, మేస్రం అర్జు పటేల్, చిత్రు పటేల్, కుమ్ర అచంత్ రావు పటేల్, మేస్రం సీతారాం, వేడ్మ చంపత్ రావు, కాత్లె కాశీరాం, కాత్లే రాము, మడావి తుల్సిరాం, మేస్రం జంగు, పెందుర్ అమృత్ రావు, పెందోర్ గోపల్ , సలాం జాకు, మేస్రం దావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను శుభ్రంగా ఉంచాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** పాఠశాల పరిసరాలు ఎల్లపుడు పరిశుభ్రంగా ఉంచాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ ఉన్నత పాఠశాల నంబర్ –2 లో శానిటేషన్ వర్కర్లకు నిర్వహిస్తున్న ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి సందర్శించి డీఈఓ, శానిటరీ రిసోర్స్ పర్సన్లను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీళ్లు పోస్తూ సంరక్షించాలన్నారు. అదనంగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమ కోర్స్ కోఆర్డినేటర్ గా జే నారాయణ వ్యవహరించగా, సాహిత్, అవినాష్, సుధాకర్ జిల్లా రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. ప్రతి మండలం నుండి ఒక ఉపాధ్యాయుడు ఇద్దరు సానిటరీ వర్కర్లు మండల స్థాయి రిసోర్స్ పర్సన్ లుగా వీరు మండల స్థాయిలో అన్ని పాఠశాలల సానిటరీ వర్కర్లకు శిక్షణ ఇస్తారన్నారు.

## అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో గుండి రోడ్డు పక్కన బాగ్య నగర్, సందీప్ నగర్, ఆర్ ఆర్ కాలని, జన్కపూర్,లో విచ్చల విడిగా డిటిసిపి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు అమ్ముతున్నారని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు కి వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ విచ్చలవిడిగా అక్రమ వెంచర్లు వేసుకొని అమాయకమైన ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నారని, ప్రభుత్వా అనుమతులు లేకుండనే వెంచర్లు ఏర్పాటు అవుతున్నాయన్నారు. వెంచర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



